


## హోలిస్పిరిట్ పవర్ మినిస్ట్రీస్, రేణిగుంట

# కానుక పెట్టె

**మూల వాక్యం– యోహాను 8-20** ఆయన దేవాలయములో బోధించుచుండగా, కానుక పెట్టె యున్న చోట ఈ మాటలు చెప్పెను.

ప్రభువు నందు ప్రియమైన సహోదరులారా, మనము ఏ చర్చికి వెళ్లినా అక్కడ మనకు బాగా కనిపించేది కానుక పెట్టె. పరిశుద్ధ గ్రంథంలో కానుక పెట్టె గురించి ఏమి వ్రాయబడిందో ఈ అంశంలో ధ్యానం చేసుకుందాం.

**యెహెజ్కేలు 20-40** నిజముగా ఇశ్రాయేలీయుల ఉన్నతమైన కొండయగు నా పరిశుద్ధ పర్వతమందు దేశములో నున్న ఇశ్రాయేలీయులందరును నాకు సేవ చేయుదురు. ఇదే ప్రభువైన యెహోవా వాక్కు. అచ్చటనే నేను వారిని అంగీకరించెదను.అచ్చటనే మీ ప్రతిష్ఠితమైన యర్పణలను, మీ ప్రథమ ఫలదానములను, ప్రతిష్ఠితములగు మీ కానుకలనన్నిటిని నేనంగీకరించెదను.

**మొట్ట మొదటి కానుక పెట్టె:**

**2 రాజులు 12:7,8** యోవాషు యాజకుడైన యెహోయాదాను మిగిలిన యాజకులను పిలిపించి – మందిరములో శిథిలమైన స్థలములను మీరెందుకు బాగు చేయక పోతిరి? ఇకను మీ మీ నెలవైన వారి యొద్ద ద్రవ్యము తీసికొనక, మందిరములో శిథిలమైన స్థలములను బాగు చేయుటకై మీరు అంతకుముందు తీసికొనిన దానినప్పగించుడని ఆజ్ఞ ఇచ్చియుండెను. కాబట్టి యాజకులు – మందిరములో శిథిలమైన స్థలములను బాగు చేయుట మా వశము లేదు గనుక జనుల యొద్ద ద్రవ్యము ఇక తీసికొనమని చెప్పిరి.

**పెట్టెకు బెజ్జము ఎక్కడ పెట్టాలి? కానుక పెట్టె ఎక్కడ ఉండాలి?**

**2 రాజులు 12:9** అంతట యాజకుడైన యెహోయాదా ఒక పెట్టెను తెచ్చి దాని మూతకు బెజ్జము చేసి, బలిపీఠము దగ్గరగా యెహోవా మందిరములో ప్రవేశించు వారి కుడి పార్శ్వమందు దానినుంచగా ద్వారముకాయు యాజకులు యెహోవా మందిరములోనికి వచ్చిన ద్రవ్యమంతయు అందులో వేసిరి.

**లెక్క చూచిన ద్రవ్యమును ఏమి చేయాలి?**

**2 రాజులు 12:10** పెట్టెలో ద్రవ్యము విస్తారముగా ఉన్నదని వారు తెలియజేయగా రాజు యొక్క ప్రధాన మంత్రియును ప్రధాన యాజకుడును వచ్చి,యెహోవా మందిరమందు దొరికిన ద్రవ్యము లెక్కచూచి సంచులలో ఉంచిరి.

**కానుక పెట్టె డబ్బు దేనికి వాడాలి?**

**2 రాజులు 12:11-13** తరువాత వారు ఆ ద్రవ్యమును తూచి యెహోవా మందిరమందు కాపరులకు, అనగా పనిచేయించు వారికప్పగించిరి. వీరు యెహోవా మందిరమందు పనిచేసిన కంసాలులకును శిల్పకారులకును కాసెపనివారికిని రాతి పనివారికిని, యెహోవా మందిరమందు శిథిలమైన స్థలములను బాగు చేయుటకు మ్రానులనేమి చెక్కబడిన రాళ్లనేమి కొనుటకును, మందిరము బాగుచేయుటలో అయిన ఖర్చు అంతటికిని, ఆ ద్రవ్యము ఇచ్చుచు వచ్చిరి.

యెహోవా మందిరమునకు వెండి పాత్రలైనను, కత్తెరలైనను, గిన్నెలైనను, బాకాలైనను, బంగారు పాత్రలైనను, వెండి పాత్రలైనను చేయబడలేదు గాని

**కానుక పెట్టెలోని ద్రవ్యములో పనివారి కూలీలు ఇవ్వవచ్చు.**

**2 రాజులు 12:14** మరమ్మతు పనిచేయువారికి మాత్రము అ ద్రవ్యము ఇచ్చి యెహోవా మందిరమును మరల బాగుచేయించిరి.

**నమ్మకస్తులకే అప్పజెప్పాలి.**

**2 రాజులు 12:15** మరియు పనివారికిచ్చుటకైనను ఆ ద్రవ్యము అప్పగింత పెట్టుకొనిన వారు నమ్మకస్తులని వారిచేత లెక్క అడగలేదు.

**బలుల అర్పణల వలన సొమ్ము యాజకులది.**

**2 రాజులు 12:16** అపరాధ పరిహారార్ధ బలుల వలనను పాపపరిహారార్ధ బలుల వలనను దొరికిన సొమ్ము యెహోవా మందిరములోనికి తేబడలేదు, అది యాజకులదాయెను.

**ప్రభువైన క్రీస్తు కానుక పెట్టెలో జనసమూహము డబ్బు వేయటం చూచారు.**

**మార్కు 12:41** ఆయన కానుక పెట్టె యెదుట కూర్చుండి, జనసమూహము ఆ కానుకపెట్టెలో డబ్బులు వేయుట చూచుచుండెను. ధనవంతులైన- వారనేకులు అందులో విశేషముగా సొమ్ము వేయుచుండిరి.

**ధనవంతుల కంటె బీధ విధవరాలు ఎక్కువ వేసిందని సాక్ష్యం చెప్పారు.**

**మార్కు 12:43** ఆయన తన శిష్యులను పిలిచి కానుక పెట్టెలో డబ్బులు వేసిన వారందరికంటె ఈ బీద విధవరాలు ఎక్కువ వేసెనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

**బీధ విధవరాలు, లేమిలో తన జీవనమంతయు వేసింది:**

**లూకా 21:4** వారందరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి కానుకలు వేసిరిగాని యీమె తన లేమిలో తనకు కలిగిన జీవనమంతయు వేసెనని వారితో చెప్పెను.

**కానుక పెట్టెలో రక్త క్రయధనము వేయతగదు:**

**మత్తయి 27:6** ప్రధాన యాజకులు ఆ వెండి నాణెములు తీసికొని- ఇవి రక్త క్రయధనము గనుక వీటిని కానుక పెట్టెలో వేయతగదని చెప్పుకొనిరి.

**కానుకకు పనికిరాని సొమ్ము:**

**ద్వితీ 23:18** పడుపుసొమ్మునేగాని కుక్కవిలువనేగాని మ్రొక్కుబడిగా నీ దేవుడైన యెహోవా యింటికి తేకూడదు. ఏలయనగా ఆ రెండును నీ దేవుడైన యెహోవాకు హేయములు.

**ముగింపు:-**కానుక పెట్టె ఎక్కడ ఉంచాలి, దానిలోని ద్రవ్యము ఎలాంటి వారికి అప్పగించాలి, ఆ ద్రవ్యమును దేని కొరకు వాడాలి అన్న విషయమును పరిశుద్ధ గ్రంథం స్పష్టంగా తెలియజేసింది. కానుకగా అర్పింపదగినది ఏమిటి, అర్పింపకూడనిది ఏమిటి అనే విషయంలో అనుసరిస్తున్నారు. కానుక పెట్టెలోని ద్రవ్యమంతా తమ సొంత అవసరాల కొరకు వాడుకొనే వారు అనేకులున్నారు. దశమ భాగములు ఇవ్వకపోతే ప్రభువు బల్ల కూడ ఇవ్వని సేవకులున్నారు. వారికి కానుక మీద కానుక పెట్టె మీద ఉన్నంత శ్రద్ధ ఆత్మల మీద ఉండదు.. ప్రియ సేవకుడా, జాగ్రత్తా, ప్రభువుకు లెక్క ఒప్ప చెప్పవలసిన వాడవని జ్ఞాపకం చేస్తున్నాను. వాక్యములో చెప్పిన క్రమాలు పాటించి తీర్పు దినాన దేవుని యెదుట ధైర్యముగా నిలువబడగలిగిన వారముగా మనముండాలి.

అలాంటి ధన్యత పరిశుద్ధాత్మ దేవుడు మనకనుగ్రహించును గాక! ఆమేన్...